
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
3
శుక్రవారం 10 అక్టోబరు 2025





నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

భద్రాచలం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతా రామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు.



సీఎం, డిప్యూటీ సీఎంలతో తుమ్మల భేటీ

- వేర్వేరుగా సమావేశం.. సీతారామ పనుల పురోగతిపై చర్చ
- పలు అభివృద్ధి పనులు, భూసేకరణ సమస్యల గురించి కూడా..

ఖమ్మం /కొత్తగూడెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం వేర్వేరుగా భేటీ అయ్యారు. హైదరాబాద్ సచివాలయంలో వారితో సమావేశమైన తుమ్మల ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన సీతారామా ప్రాజెక్టు పనుల పురోగతిపై చర్చించారు. ఈ ప్రాజెక్టు పనులతో పాటు జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి పనులు, భూసేకరణ సమస్యలను తుమ్మల వారికి వివరించారు. అలాగే జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను తుమ్మల వారికి అందజేయగా.. వాటికి సీఎం, డిప్యూటీ సీఎం సానుకూలత వ్యక్తంచేశారు. నేషనల్ హైవే పనుల పురోగతితో పాటు కొత్తగూడెం ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ, భద్రాచలం కరకట్ట విస్తరణ, పలు గ్రామీణ రహదారులు, నీటిపారుదల, విద్యుత్‌శాఖ పరంగా అభివృద్ధి పనులు, భూసేకరణ సమస్యలపై ఈ భేటీల్లో చర్చ జరిగింది. ముఖ్యంగా సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ భూసేకరణపై ప్రధాన చర్చ జరగ్గా.. ఈకెనాల్స్‌ను సత్వరం పూర్తిచేస్తే జిల్లాకు సాగునీటి సమస్య తీరుతుందని తుమ్మల వారికి వివరించారు. అలాగే భూసేకరణకు ఎదురవుతున్న సమస్యలతో పాటు భూసేకరణ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సీఎంను కోరగా తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లింపునకు హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాలు కాపాడుతూ సీతారామ పనులు వేగవంతంగా చేపడతామని సీఎం తెలిపారు. ఖమ్మం-దేవరపల్లి, అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణలో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయని చెప్పగా.. భూసేకరణ వేగవంతం చేయాలని సీఎం రెవెన్యూ యంత్రాంగానికి సూచించారు. అలాగే ఎర్త్‌సైన్సు యూనివర్సిటీ ప్రారంభానికి సీఎంను తుమ్మల ఆహ్వానించగా.. ఎన్నికల కోడ్ అనంతరం వస్తానని సీఎం హామీ ఇచ్చారు. అలాగే హైవేల వెంట ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్‌ను యుద్ధప్రాతిపదన చేపట్టాలని భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులపై సమన్వయంతో పనులు చేపట్టాలని రాష్ట్ర అధికారులకు భట్టి సూచించారు. రైతు సంక్షేమానికి, జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు కూడా అందిస్తామని ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినట్టు మంత్రి తుమ్మల కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు.

బీసీ రిజర్వేషన్ల అంశం రోజురోజుకీ ఉత్కంఠను పెంచుతోంది. మొదట రిజర్వేషన్లు ఖరారు అవుతాయా? లేదా? అన్న ప్రశ్నలు.. ఆ తర్వాత కోర్టు విచారణతో ఎన్నికలు జరుగుతాయా? లేదోనని మరో టెన్షన్.. తీరా ఎన్నికల షెడ్యూల్ విడుదలై నోటిఫికేషన్ ముందురోజు వరకు కూడా ఏం జరుగుతుందోనన్న ఆలోచనలు. తీరా కోర్టు విచారణను గురువారానికి వాయిదా వేయడంతో నోటిఫికేషన్ విడుదల. ఇక ఎన్నికల ప్రక్రియ సాగుతోందనుకుంటున్న సమయంలో హైకోర్టు బ్రేక్ వేసింది. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ విడుదల చేసిన జీవో నెంబర్ 9తోపాటు, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో స్థానిక ఎన్నికలకు బ్రేక్ పడగా.. నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికలకు సిద్ధమై ముందుకెళ్దామనుకున్న పార్టీలు, రిజర్వేషన్ల ప్రకారం తమకు అవకాశం లభిస్తుందన్న ఆశల్లో ఉన్న అశావహులకు షాక్ తగిలినట్టయింది.



స్థానికానికి బ్రేక్
ఆశావహులకు షాక్

రిజర్వేషన్లు, నోటిఫికేషన్‌పై స్టే విధించిన హైకోర్టు

- డీలా పడిన ఆశావహులు
- సత్తా చాటాలనుకున్న నాయకుల్లో నిరాశ
- ప్రక్రియ ఆగడంతో అందరిలోనూ నైరాశ్యం

ఖమ్మం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి):స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు అంశం రోజురోజుకు ఉత్కంఠను పెంచుంతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 9పై బుధ,గురువారాల్లో విచారణ నిర్వహించిన హైకోర్టు.. జీవో 9 అమలు, ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై స్టే విధిస్తూ గురువారం ప్రకటించింది. దీంతో స్థానిక సంస్థల రాజకీయాల్లో ఒక్కసారిగా స్తబ్దత నెలకొంది. అభ్యర్థిత్వాలు ఆశించిన, పోటీకి సిద్ధమైన వారంతా డీలా పడ్డారు. అలాగే జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలని భావించిన పార్టీల నాయకులకు నిరాశే మిగిలింది. బుధవారం విచారణ అనంతరం గురువారానికి వాయిదా వేయడంతో.. ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అధికారులు గురువారం జిల్లాలో జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల తొలివిడత ఎన్నికలకు.. అన్నిమండలాల్లోని రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదచేసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తొలిరోజు జడ్పీటీసీలకు రెండు, ఎంపీటీసీలకు 5 నామినేషన్లు దాఖలయ్యాయి.

దాఖలుకు ఏర్పాట్లు.. కానీ..

శుక్ర, శనివారం వరకు దాఖలుకు గడువు ఉండడంతో భారీగా నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్న ఆశావహులు తమ పార్టీలనుంచి అభ్యర్థిత్వాలు ఖరారుచేయించుకున్నారు. కొందరు బీఫారాలను కూడా స్వీకరించారు. ఇక ఎంపీపీల రేసులో ఉన్న వారు ఎంపీటీసీ అభ్యర్థులతో సంప్రదింపులు జరిపి.. వారికి కూడా ఖర్చుపెట్టేలా ఒప్పందాలు చేసుకున్నారు. ఈ క్రమంలో ఒక్కో ఎంపీటీసీకి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఖర్చుపెడతామని ఎంపీపీ రేసులో ఉన్నవారు కొందరు హామీ ఇవ్వడంతో పాటు అడ్వాన్స్‌గా కొంత నగదు కూడా ఇచ్చినట్టు చర్చజరుగుతోంది. అయితే షెడ్యూల్ ప్రకారం తొలివిడత నామినేషన్లకు మరో రెండు రోజులు సమయం ఉన్న నేపథ్యంలో చాలామంది అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ ఇంతలోనే కోర్టు ఇచ్చిన స్టే వారిలో నిరాశను మిగిల్చింది.

వేచిచూసే ధోరణిలో..

కోర్టులో విచారణ జరుగుతున్నక్రమంలో స్థానిక ఎన్నికలు జరుగుతాయా? ఆగుతాయా? అన్న గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో కొందరు అభ్యర్థులు కోర్టు నిర్ణయం పూర్తిస్థాయిలో వచ్చే వరకు ఉండి నామినేషన్లకు వెళ్లాలని భావించారు. గురువారం హైకోర్టు తీసుకోబోయే నిర్ణయంకోసం ఎదురుచూశారు. దీంతో తొలిరోజున స్వల్పసంఖ్యలోనే నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల నుంచి ఎవరూ నామినేషన్లు వేయలేదు. అయితే హైకోర్టు తదుపరి విచారణ ఎప్పుడుంటుంది? అప్పుడు రిజర్వేషన్లు ఎలా ఉంటాయి? మార్పులు జరిగితే మళ్లీ తమకు అనుకూలంగా రిజర్వేషన్ ఉంటుందో? ఉండదో? అన్న మీమాంసలో పడ్డారు.

అటవీశాఖలో విజిలెన్స్ విచారణ పూర్తి

రాష్ట్ర స్థాయికి చేరిన చర్యల సిఫార్సులు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో అక్రమ పర్మిట్ల మంజూరు అవినీతిపై విజిలెన్స్ విచారణ పూర్తయ్యింది. ఈ క్రమంలో అక్రమార్కులపై చర్యలకు సంబంధించిన సిఫార్సులు ఖమ్మం నుంచి రాష్ట్ర స్థాయికి చేరాయి. రెండు రోజులుగా ఖమ్మంలో ఉండి చింతకాని ఇతర ప్రాంతాల్లో విచారణ చేసిన రాష్ట్ర విజిలెన్స్ అధికారులు గురువారం హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. కాగా జాతీయ స్థాయిలో అటవీశాఖ సైబర్ క్రైంగా అక్రమ పర్మిట్లు కేసు నమోదు జరిగింది. అక్రమ పర్మిట్లు అవినీతి డొంకపై జరిగిన విచారణ నివేదికను జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ అటవీశాఖ ప్రిన్స్‌పల్ చీఫ్ కన్జర్వేటర్‌కు నివేదించారు. రాష్ట్ర స్థాయిలోకి నివేదికలు వెళ్లడంతో సెక్షన్ ఆఫీసర్ పై స్థాయిలోని అటవీశాఖ అధికారులపై వేటు పడే అవకాశాలున్నాయి.

రక్షించేందుకు సిఫార్సులు

అటవీశాఖలో సెక్షన్ ఆఫీసర్ పైస్థాయిలోని రక్షించేందుకు వారం రోజులుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా ఉద్యోగ సంఘాల నాయకులు అటవీశాఖ రాష్ట్ర స్థాయి అధికారులను కలిసే ప్రయత్నాలు చేస్తున్నా అధికారులు అనుమతించటం లేదని తెలుస్తోంది.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కమాన్‌బజార్ శ్రీస్తంభాద్రి వేంకటేశ్వరస్వామి 61వ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం తీర్థబిందె, ప్రాతరాధన, హవనం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి రాజభోగం, సాయంత్రం సాయమారాధన, హోమబలిహరణములు, సదస్యం నిర్వహించారు. రాత్రి స్వామి వారి రథోత్సవం ఘనంగా జరగ్గా.. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఈవో వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



ప్లాస్టిక్ సంచులు పరిశీలిస్తున్న పారిశుధ్య పర్యవేక్షకులు

ఎట్టకేలకు కేఎంసీ అధికారుల్లో కదలిక

- ప్లాస్టిక్ నిల్వలపై భారీగా జరిమానాలు
- ఒకే రోజు రూ.81,500

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు ఎట్టకేలకు ఖమ్మం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారుల్లో కదలిక వచ్చింది. ప్లాస్టిక్ కవర్ల నిల్వలపై భారీగా జరిమానాలు విధించారు. గతంలో పైస్థాయి అధికారులు ప్లాస్టిక్ కవర్లు పరిశీలనకు దుకాణాలు వచ్చే సమయానికి ముందే స్థానికంగా ఉన్న జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆయా ప్లాస్టిక్ కవర్ల వ్యాపారులకు సమాచారం అందించే వారు. పైస్థాయిలోని అధికారులు సైతం మొక్కుబడిగా జరిమానాలు విధించారు. కాగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు గురువారం జరిమానాలు మాత్రం ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు జరిపే వారిని ఉలికిపాటుకు గురి చేశాయి. ఇదేవిధంగా రోజు వారి జరిమానాలు విధించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

జరిమానాలు ఇలా.. న్యూ బాబా పాలీ బ్యాగ్స్ రూ.10వేలు, బాబా పాలీ బ్యాగ్స్ రూ.15వేలు, న్యూ బాలాజీ ప్లాస్టిక్స్ రూ.10వేలు, రమేష్ నావల్టీ రూ.5వేలు, భవాని ప్లాస్టిక్స్ రూ.15వేలు, అంబికా ప్లాస్టిక్స్ రూ.10వేలు, భాను పాలీ బ్యాగ్ రూ.15వేలు ఒకే రోజు మొత్తం రూ.81,500 జరిమానాలు విధించి ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు జరిపే వారిని హడలెత్తించారు.

ఆర్టీసీకి దసరా పండుగ..

- రీజియన్‌లో రికార్డు స్థాయిలో రూ.24.22కోట్ల ఆదాయం
- 17 రోజుల పాటు బ్రేక్ లేకుండా సాగిన ప్రయాణం
- రీజియన్‌లో ఏడు డిపోల్లో 37.50లక్షల మంది జర్నీ
- ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించి 3.17లక్షల కి.మీ. తిరిగిన బస్సులు
- సాధారణ సర్వీసులతో పాటు 1,208అదనపు సర్వీసులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ఖమ్మం రీజియన్‌కు కలిసివచ్చింది. రీజియన్ పరిధిలో దసరా పండుగ సందర్భంగా కిందిస్థాయి నుంచి అధికారుల వరకు విస్తృతంగా సేవలందించడంతో ఏడు డిపోల్లో రికార్డు స్థాయిలో రూ.24.22కోట్ల ఆదాయం సమకూరింది. గతనెల 20వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు నిర్విరామంగా 17రోజుల పాటు రీజియన్ వ్యాప్తంగా సాధారణ సర్వీసులతో పాటు 1,208అదనపు సర్వీసులను నడిపారు. ఒక్కో బస్సు సుమారు 435కిలోమీటర్లు ప్రయాణించి సురక్షిత స్థానాలకు ప్రయాణికులను చేర్చడం గమనార్హం. రీజియన్‌లో మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసిన మహిళలకు సంబంధించిన ఆదాయం కూడా సమకూరింది.

6న ఒక్కరోజే రూ.2.22కోట్ల ఆదాయం

మునుపెన్నడూ లేనివిధంగా ఈనెల 6వ తేదీ ఒక్కరోజే రూ.2.22కోట్ల ఆదాయం రాగా ఇప్పటివరకు రీజియన్‌లో 40,66,507కిలోమీటర్లు తిరగడం ద్వారా రూ.24.22కోట్ల ఆదాయం సమకూరింది. ముందంజలో ఖమ్మం ఉండగా చివరి స్థానంలో ఇల్లెందు నిలిచింది. ఖమ్మం రూ.5.53కోట్లు, సత్తుపల్లి రూ.4.40కోట్లు, భద్రాచలం రూ.4.44కోట్లు, మణుగూరు రూ.3.25కోట్లు, మధిర రూ.3.00కోట్లు, కొత్తగూడెం రూ.2.48కోట్లు, ఇల్లెందు రూ.1.12కోట్ల ఆదాయం వచ్చింది. ఎక్కడా ట్రాఫిక్ సమస్య లేకుండా... ఉన్న వనరులను సమకూర్చుకుంటూ సమష్టి కృషితో ఈఏడాది అన్ని డిపోల్లో ఆదాయాన్ని తీసుకురావడంలో ఉన్నతాధికారులు విజయం సాధించారు. దసరా పండుగ రద్దీని సమర్థవంతంగా ఎదుర్కొని అదనపు సర్వీసులను నడపడంతో పాటు సుదూర ప్రాంతాలతో పాటు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు పల్లెలకు బస్సులను నడిపింది. ప్రయాణికుల రద్దీతో ఆర్టీసీ యాజమాన్యం ఇబ్బందులు ఎదుర్కొన్నా ఆదాయంలో మాత్రం చాలెంజ్‌ను అధిగమించింది.

సిబ్బంది అంకితభావంతో పనిచేశారు : సరిరామ్, ఆర్ఎం

6న రీజియన్ మొత్తంలో 107ఆక్యుపెన్సీ సాధించగా ఈపీకే 68.76వచ్చింది. అదేరోజు 3.17లక్షల హైయ్యెస్ట్ వాల్యూమ్ (అదనంగా 54వేల కిలోమీటర్లు) తిప్పాం. ఓపీఆర్ఎస్‌లో 416బస్సులు తిప్పగా 256బస్సులను ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు నడిపాం. గతనెల 27న విపరీతమైన ట్రాఫిక్ ఉండగా ఎంజీబీఎస్‌లో సమస్యను సైతం అధిగమించి మరీ సర్వీసులు నడిపాం. పండుగ సమయంలో డ్రైవర్లు, కండక్టర్లకు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, డిపో సిబ్బంది అంకితభావంతో సేవలు అందించడంతోనే డిపోలకు ఆశాజనకమైన ఆదాయం సమకూరింది. లక్కీ డ్రా కార్యక్రమం కూడా కలిసివచ్చింది.



సత్తుపల్లిలో బస్సులు ఎక్కుతున్న ప్రయాణికులు

వరిలో ఎండు తెగులు..

ఆందోళనలో అన్నదాతలు

4



డబ్బు కోసం చంపేశారు!

- యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
- ముగ్గురూ కలిసి.. కత్తితో పొడిచి హతమార్చిన వైనం
- ఆ తర్వాత శరీర భాగాలను పారవేసేందుకు యూట్యూబ్‌లో సెర్చ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ తిరుపతి రెడ్డి

5

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోటి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రకటించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్, విప్లవ, వామపక్ష, ప్రజాస్వామిక అభ్యర్థులను గెలిపించాలని, అటువంటి అభ్యర్థులు డబ్బు, ప్రలోభాలకు గురికాకుండా పల్లేలు, గూడేలు,తండాలు, గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తారని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కోరారు. గురువారం ఖమ్మంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వామపక్ష అభ్యర్థులను గెలిపించటం ద్వారా స్థానిక సంస్థలు వెలుగులోకి వస్తాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మాస్‌లైన్ పార్టీ రాష్ట్రంలో 90కుపైగా సర్పంచులు, 50కు పైగా ఎంపీటీసీ, 15కు పైగా జెడ్పీటీసీ స్థానలలకు అభ్యర్థులను సిద్ధం చేసిందన్నారు. సాధ్యమైన మేరకు స్వతంత్రులుగా పోటీ చేస్తారని తమతో కలిసి వచ్చే వామపక్ష, విప్లవ, ప్రజాస్వామిక శక్తులను కలుపుకుపోతామన్నారు. తాము పోటీ చేయని స్థానల్లో వామపక్ష అభ్యర్థులకు మద్దతు ఇస్తామన్నారు.

మతోన్మాద బీజేపీతో పాటుగా బూర్జువ పార్టీలకు వ్యతిరేకంగా పనిచేయాలని పార్టీ సెంట్రల్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేశాయని, స్థానిక సంస్థల హక్కుల కోసం మాస్‌లైన్ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని 73, 74 ఆర్టికల్స్ ప్రకారం స్థానిక సంస్థలకు మొత్తం అధికారం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో షెడ్యూల్ 5 మేరకు ఆదివాసీ ప్రజలకే అన్ని స్థానాలను రిజర్వ్ చేయాలని కోరారు.

వరిలో ఎండు తెగులు..

» ఆందోళనలో రైతులు

పెనుబల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరిలో ఆకు ఎండుతెగులు సోకి వరి ఆకులు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ప్రధాన సాగునీటి వనరులైన లంకాసాగర్, రాతోని, నాగార్జునసాగర్ ఎడమ కాల్వతోపాటు అనేక చెరువులు, బోర్లు కింద 23,295ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేశారు. లింగగూడెం, పెనుబల్లి, గంగదేవిపాడు, కుప్పెనకుంట్ల, కోంద్రుపాడు, గణేశులపాడు తదితర గ్రామాల్లో వరిపైరుకు ఎండుతెగులు సోకి ఆకులు ఎండిపోయి మొక్కలు కూడా చనిపోతున్నారని రైతులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రం వరి కంకులు ఏర్పడ్డాయి. కానీ మరికొన్ని గ్రామాల్లో ఇంకా వరి పొట్టదశలోనే ఉంది. పొట్టదశలో ఉన్న పైరుకు గాలిలో బ్యాక్టీరియా వలన ఎండుతెగులు వ్యాప్తి చెందుతుంది. దీనివలన ఆకుల చివర్ల నుంచి పసుపు లేదా నారింజ మచ్చలు ఏర్పడి క్రమంగా ఆకులు మొత్తం చనిపోతున్నాయని, తెగుళ్ల తీవ్రంగా ఉంటే మొక్క మొత్తం వాడిపోయి ఎండిపోవడం జరుగుతుందని



గంగదేవిపాడులో వరిపైరుకు ఎండు తెగులు సోకిన దృశ్యం

పెనుబల్లి వ్యవసాయ అధికారి ఏపీఎస్.ప్రసాద రాజు తెలిపారు. ఈ తెగులు ఉదయంపూట ఆకు పైన పసుపురంగు జిగురువంటి చుక్కలు కన్పిస్తాయని, ఈతెగులు అధిక తేమ వలన, భారీ వర్షపాతం ఏర్పడిన సమయంలో ఈ ఈతెగులు వ్యాపిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీని నివారణ కోసం రైతులు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. వరిలో ఈ తెగులు బ్యాక్టీరియా వల్ల ఆశిస్తుంది. నివారణ చర్యలు రసాయన పద్ధతిలో లేనప్పటికీ వరిలో నత్రజని ఎరువును దఫదఫాలుగా వేయాలి. వీలైనంత వరకు అవసరానికి మించి నత్రజని ఎరువులు వేయవద్దన్నారు. అగ్రిమైసిన్ 0.4గ్రాములు లేదా ప్లాంటోమైసిన్ లేదా పోషామైసిన్ 0.2గ్రాములు లీటరు నీటికి కలిపి కనీసం 200లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. ఇది కొంతవరకు తెగులు వ్యాప్తి చెందకుండా ఆపేందుకు సహాయపడుతుందని ఆయన తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు
చేనేత చీరలు

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇక మహిళా స్వయం సహాయక సంఘంలోని సభ్యులకు ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) నుంచి చేనేత చీరలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. చీరల పంపిణీ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నేత చీరలను తయారు చేయించారు. బతుకమ్మ వేడుకలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆ మేరకు పూర్తి స్థాయిలో చీరలు తయారి కాకపోవడంతో చీరల పంపిణీని రాష్ట్ర వ్యాప్తంగా వాయిదా వేసింది. కాగా గురువారం ఖమ్మం నగర పాలక సంస్థకు మహిళ స్వయం సహాయక సంఘాలకు పంపిణీ జరపాల్సిన చీరలు వచ్చాయి. ఒక్క ఖమ్మం నగరంలోనే పంపిణీకి తొలి విడతకు 37,300 చీరలు అందుబాటులోకి వచ్చాయి. మహిళ స్వయం సహాయక సంఘంలో కనీసం నమోదు జరిగిన మహిళలకు కూడా చీరలు పంపిణీ జరగనున్నాయి.



కేఎంసీకి చేరిన చీరలు

సీపీఐ సత్తా చాటాలి

» పార్టీ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు

చింతకాని, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సిపీఐ పార్టీ సత్తా చాటాలని పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు. గురువారం చింతకాని మండల సీపీఐ పార్టీ కార్యాలయంలో పదిమల వెంకటనర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. సీపీఐ కాంగ్రెస్ పొత్తుకు సిద్దంగా ఉందన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. నాగిలిగొండ, నేరడ, కొదుమూరు, రామకృష్ణాపురం, పొద్దుటూరు, చిన్నమండవ ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసేందుకు స్థానిక నాయకత్వం సిద్ధంగా ఉండాలని సూచించారు. జడ్పీటీసీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు, రాఘవాపురం మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావును మండల కౌన్సిల్ ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, దూసరి గోపాలరావు, మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, రాసాల మోహన్‌రావు, కన్నెబోయిన విజయమ్మ, దొబ్బల వెంగళరావు, గోగుల ఆది, కొల్లి రవి, పగిళ్లపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు
పాల్పడితే కఠిన చర్యలు

» సబ్‌కలెక్టర్ మృనాల్‌శ్రేష్ఠ

అశ్వాపురం అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకోడ్ అమలులో ఉన్న సమయంలో ఎంతటివారైనాసరే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ హెచ్చరించారు. గురువారం అశ్వాపురం ఎంపీడీవో, తహసల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులు, రాజకీయపక్షాలు ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. అధికారులు,సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీడీవో రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠా

ఖమ్మం రైల్వేలో ఆధునిక హంగులు

» బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఖమ్మంరైల్వేస్టేషన్‌తో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకివాసుదేవరావుతో కలిసి గురువారం పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో జరుగుతున్న పనులను ఆయన రైల్వే అధికారులతో కలిసి సమీక్షించి పలసూచనలు చేశారు. ఈసందర్భంగా నెల్లూరి మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా రైల్వేవ్యవస్థను ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని, ఖమ్మం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.25.41కోట్లు నిధులు కేటాయించినట్టు తెలిపారు. బీజేపీప్రభుత్వం ప్రజలకు సౌకర్యవవంతమైన రవాణ సేవలు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతుందన్నారు. అభివృద్ధి పనలు పూర్తయిన తర్వాత రాష్ట్రంలో ఒక మోడల్‌స్టేషన్‌గా నిలుస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, నున్నా రవికుమార్, గుత్తా వెంకటేశ్వర్లు, తొండేపు సైదేశ్వరరావు, వేల్పుల సుధాకర్, మంద సరస్వతి, మార్తి ప్రసాద్, కొండశ్యామ్, తదితరులున్నారు.



ఖమ్మం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

సమాచారహక్కు చట్టం అవార్డు
అందుకున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సమాచారహక్కు చట్టాన్ని అమలు చేయడంలో చొరవచూపిన ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి పశుసంవర్ధకశాఖ అధికారి బోడేపూడి శ్రీనివాస్‌కు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. తెలంగాణ సమాచార హక్కు కమిషన్ ఏర్పాటై 20 ఏళ్ల అయిన సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చట్టాన్ని అమలు చేయడంలో ఖమ్మం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఉత్తమంగా నిలిచారు. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈకార్యక్రమంలో హైకోర్టు జడ్జి పి సామ్ కోషీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీవీ ఆనంద్, డాక్టర్ సువర్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో అవార్డు దక్కడం పట్ల బోడేపూడి శ్రీనివాసరావును పలువురు అభినందించారు.



.గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న పశుసంవర్ధకశాఖ అధికారి బోడేపూడి శ్రీనివాసరావు

దారి దోపిడీతో వాహనదారుల బెంబేలు..

» ఆగి ఉన్న లారీలో నుంచి 40 నూనె బాక్సులు మాయం

» రెండు రోజుల క్రితం 30 బాక్సులు... పదిహేను రోజుల క్రితం రూ. లక్షన్నర ఆయిల్‌బాక్సులు మాయం

» దాబా సెంటర్ల వద్ద ఆగి ఉన్న లారీలను టార్గెట్ చేస్తున్న దొంగలు

అశ్వారావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఇళ్ళలోనో, బ్యాంకులు, వాణిజ్య సముదాయాలలో చోరీలకు పాల్పడుతూ వచ్చిన దొంగలు వారి పంథాను మార్చుకున్నట్లు కనిపిస్తుంది. లారీలలో రవాణా అయ్యే వివిధ రకాల విలువైన సామగ్రి, సరుకులను రోడ్డుపై కొద్ది నిమిషాలు నిలపితే చాలు అందులోని సరుకులను అత్యంత చాకచక్యంగా చోరీ చేస్తున్న సంఘటనలు ఇటీవల పెరిగిపోయాయి. సాధారణంగా లారీలను కొద్దిసేపు నిలపి వుంచే చెక్ పోస్టులు, డ్రైవర్లు టిఫిన్, భోజనం చేసేందుకు వాహనదాలను నిలపే డాబా సెంటర్‌లు, విశ్రాంతి కోసం ఆపే ప్రదేశాలను టార్గెట్‌గా చేసుకొని కొందరు దొంగలు లారీలలో విలువైన సామగ్రిని యదేచ్ఛగా ఎత్తుకుపోతున్నారు. వరుసగా జరుగుతున్న ఈ సంఘటనలు వాహనాలలో సరుకు రవాణా చేస్తున్న వారికి లక్షల్లో నష్టాన్ని తెచ్చిపెడుతుంది. వాహనాల డ్రైవర్లు, సరుకు యజమానులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి సంఘటనే ఒకటి మండలంలోని నారంవారిగూడెం ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే ఇలా ఉన్నాయి.

బుధవారం రాత్రి కాకినాడ నుంచి వరంగల్ కు నూనె బాక్కులను తీసుకొని ఏపీ 05టీఏ 4757 నెంబరు గల లారీ వరంగల్‌కు బయలుదేరింది. ఈ లారీ బుధవారం రాత్రి 10-40 గంటల సమయంలో మండలంలోని నారంవారిగూడెం సమీపంలో ఓ డాబా సెంటర్ వద్ద కొద్ది సేపు విశ్రాంతి తీసుకొని పుల్కాలు తిని బయలుదేరారు. సత్తుపల్లి వెళ్లిన తరువాత టైర్లు చెక్ చేసుకునే సమయంలో లోడు వాలినట్లు అనిపిస్తే లారీ డ్రైవర్ పెకి ఎక్కి చూసి



పామాయిల్ బాక్స్‌లతో వెళుతున్న లారీ

ఖంగుతిన్నాడు. టార్పాల్‌ను లారీ పైభాగంలో కోసి దాదాపు నలభై వరకు నూనె బాక్కులను ఎత్తుకెళ్ళినట్టు గమనించాడు. లారీ యజమానికి చెప్పి అక్కడే నిద్రించి గురువారం ఉదయమే సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడానికి డ్రైవర్ వెళ్ళాడు. సరుకు ఎక్కడో పోయి ఉంటుంది తమ పరిధి కాదని నిరాకరించడంతో దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని అక్కడా తమ పరిధి కాదంటూ పిర్యాదు తీసుకోలేదని, దీంతో అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌కు పిర్యాదు చేసేందుకు వచ్చినట్టు డ్రైవర్ ప్రసాద్ తెలిపారు. రెండు రోజుల క్రితం మా ప్రాంతం నుంచి మరో లారీలోని 30 నూనె బాక్కులు పోయినట్టు డ్రైవర్ తెలిపారు. పది హేను రోజుల క్రితం అశ్వారావుపేట చెక్ పోస్టువద్ద లక్షన్నర విలువైన నూనె బాక్కులు చోరీకి గురైనట్టు సమాచారం. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి హైవేపై సరుకు లోడుతో వెళ్ళే లారీలను టార్గెట్‌గా చేసుకొని ఓ మినీ వ్యాన్ లాంటి వాహనాలపై వచ్చి ఆగివున్న లారీల పక్కనే నిలపి లారీలలో సరుకును గుట్టుచపుడు కాకుండా వ్యాన్‌లలోకి డంప్ చేసుకొని వెళ్ళిపోతున్నారు. వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని అయినప్పటికి నిత్యం హైవేపై ఇలాంటి చోరీలు సంఖ్య పెరిగినట్టు చెపుతున్నారు. సులువుగా వ్యాన్‌లలోకి డంప్ చేసుకోవడానికి వీలుగా ఉన్న సరుకుల లారీలను ఎంచుకొని డ్రైవర్లు అలసి పోయి భోజనం, విశ్రాంతి తీసుకునే ప్రదేశాలను గుర్తించి ఈ చోరీలకు పాల్పడుతున్నట్టు తెలుస్తుంది. ఆ ప్రదేశంలో పెద్ద ఎత్తున వివిధ రకాల వాహనాలు నిలపి ఉండటం, వాహనదారులు టార్పాల్స్ కట్టుకోవడం, టైర్లు చెకింగ్ చేసుకోవడం వంటి పనులు చేస్తూనే ఉంటారు. దీంతో బయటి వ్యక్తులు ఎవరైన చూసిన చోరీ చేస్తున్నట్టు గుర్తించలేరు. దీనిని ఆసరాగా తీసుకొని ఓ ముఠా ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్టు తెలుస్తుంది. రవాణా వాహనాలలో నుండి ఎన్నడూ లేని విధంగా సరుకులు చోరీ అవ్వడంపట్ల వాహనదారుళ్ళో ఆందోళన వ్యక్తం అవుతుంది. వాహనదారులకు లక్షల్లో నష్టం వాటిల్లుతుంది. ఈ కొత్త తరం దందాతో హైవేపై వెళ్ళే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఆదిలోనే తుంచకపోతే ఈ ముఠా మరింత రెచ్చిపోయే అవకాశాలున్నాయి. గురువారం జరిగిన చోరీపై డ్రైవర్ అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ఆగిఉన్న లారీ నుంచి టార్పాల్ కోసి నూనె బాక్సులు ఎత్తుకెళ్లిన దుండగులు

నియంత్రణ ఏదీ? జరిమానాలతో సరి..

పోలీసులకు వివిధ రకాల టార్గెట్‌లతో నానా ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఉన్న సిబ్బందిలో ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ముగ్గురు నలుగురు సిబ్బంది ఏదో రహదారిపై పగలంతా కాపలాకాసి వాహనాలు నిలపి పొటోలు తీయడం, జరిమానాలు విధించడంతోనే కాలం సరిపోతుంది. నిర్దేశించిన టార్గెట్‌లను అందుకోవడానికే ఇబ్బందులు పడుతున్నారు. టార్గెట్ సాధనలో ఉన్న సిబ్బంది వాహనాలు డ్రైవింగ్ లైసెన్సులు, ఇతరత్రా తనిఖీలు, క్రైమ్‌లపై పూర్తిగా దృష్టి సారించలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైన ఇలాంటి సంఘటనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టకపోతే వాహనాలు రోడ్లపైన తిరిగే పరిస్థితి ఉండదనే ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇటీవల కాలంలో హైవేరోడ్డుపైన యదేచ్ఛగా గంజాయి, బియ్యం అక్రమ రవాణా, గోవుల అక్రమ రవాణా, వివిద రకాల నిషేధిత సరుకులు అక్రమ రవాణా యదేచ్ఛగా జరుగుతుంది. ఈజీ మనీకి అలవాటు పడిన యువత అక్రమ మార్గాలను ఎన్నుకొని పలురకాల అసాంఘిక కార్యక్రమాలవైపు మళ్ళుతున్నారు. వీటిపై కూడ ప్రత్యేక దృష్టి పెట్టాలసని అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ దుకాణాల్లో
సివిల్‌సప్లయీస్ అధికారుల తనిఖీలు

వైరా, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ సహా మండలంలోని పలు గ్రామాల్లో రేషన్‌షాపులను పౌరసరఫరాలశాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఖమ్మం అర్బన్, రూరల్, సత్తుపల్లి, మధిర పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, విజయ్‌బాబు, నరేష్, వీరయ్య, ప్రసన్న, గిర్దావర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రేషన్‌షాపులు తనిఖీ చేశారు. షాపుల్లో నిల్వ ఉంచిన బియ్యం వివరాలను రికార్డుల్లో పరిశీలించారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా విక్రయించినా, కొనుగోలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని డీలర్లను అధికారులు ఆదేశించారు.



తనిఖీకి వచ్చిన సివిల్‌సప్లయీస్ అధికారులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఖమ్మంక్రైం అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఖానాపురంహవేలి ఎస్ఐ డి.శ్రావణ్‌కుమార్ గురువారం బాధితుడికి అందించారు. పుట్టకోటకు చెందిన రెడ్డబోయిన రాంబాబు అనే వ్యక్తి ఇటీవల తన విలువైన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడి ఫిర్యాదుమేరకు ఐఎంఈఐ నెంబరు ఆధారంగా ఎస్ఐ శ్రావణ్‌కుమార్ గుర్తించి తిరిగి బాధితుడికి అందించారు.

డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయురాలు

» ఇబ్బందుల్లో చిన్నారులు

» చదువులు సాగక అనంతారం పాఠశాల విద్యార్థుల అవస్థలు

» ఆందోళన చేస్తున్న విద్యార్థులు » పట్టించుకోని ఉన్నతాధికారులు

కరకగూడెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని ప్రయివేటుకు దీటుగా విద్య బోధన అందిస్తున్నామని పాఠశాలల ప్రారంబానికి ముందు బడిబాట కార్యక్రమంలో అధికారులు తెలుపుతున్న మాటలు ఆచరణలో సాధ్యం కావడం లేదని విద్యార్థులు విద్యార్థుల తల్లిందండ్రులు ఆరోపిస్తున్నారు. మండలంలోని అనంతారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్‌గా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు జూన్‌లో డిప్యూటేషన్ పేరు తో పాల్వంచ కేటీపీఎస్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. దాంతో ఇక్కడ విద్యార్థులకు చదువులు సాగడం లేదు. ఇక్కడ ఉపాధ్యాయులను నియమించకుండా మరో పాఠశాలకు ఎలా డిప్యూటేషన్ వేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి తక్షణమే అనంతారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలుగా నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌కు మొరపెట్టుకున్న సమస్య పరిష్కారం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారు లు తమకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.



ఉపాధ్యాయురాలిను నియమించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

కుటుంబసభ్యులకు తీవ్రగాయాలు

అశ్వాపురం, అక్టోబరు 9(ఆంధ్రజోతి): మండల పరిధి లోని మొండికుంట అలుగువాగు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా,మృతిని కుటుంబసభ్యులు తీవ్రగాయాలపాలయ్యారు. సంఘటనకు సంబందించిన వివరాలిలాఉన్నాయి. మణుగూరు మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన సిహెచ్.రాము(39) తన భార్య పిల్లలతో ద్విచక్రవాహనంపై భద్రాచలం వెళ్లివస్తున్నారు. ఈనేపథ్యంలో మొండికుంట అలుగువాగు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో రాము సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, భార్య, కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. కాగా కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు, సంఘట న విషయం తెలుసుకున్న అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సఘటస్థలానికి చేరు కుని ప్రమాద వివరాలు సేకరించారు.క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా చిక్సి నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



రోడ్డుప్రమాదంలో మృతిచెందిన రాము

మానవతారాయ్‌కు డాక్టరేట్

కల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణాకి చెందిన కోటూరి మానవతరాయ్ ఉస్మానియా విద్యాలయం నుంచి గురువారం డాక్టరేట్ అందుకున్నారు. నాటి మాజీ గవర్నర్, హైదరాబాద్ రాష్ట్ర (తొలి, చివరి) ముఖ్యమంత్రి, డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు జీవితం-సాహిత్యం' అనే అంశంపై తెలుగు శాఖకు సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా విద్యాలయం మానవతారాయ్‌కు పై విధంగా డాక్టరేట్ ప్రకటించింది. ప్రస్తుతం సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు ఈ పరిశోధనకు మార్గదర్శకత్వం వహించారు. కల్లూరుకు చెందిన మానవతారాయ్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఓయూ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బి పూర్తి చేసిన మానవతారాయ్ హైకోర్టు న్యాయవాదుల సంఘంలో శాశ్వత సభ్యుడిగా కొనసాగుతున్నారు. విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్‌గా నిరుద్యోగుల తరుపున అనేక పోరాటాలు చేశారు.

ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేస్తున్నారు. మానవతారాయ్‌కు డాక్టరేట్ రావటం పట్ల పలువురు అధ్యాపకులు, ఆచార్యులు, న్యాయవాదులు, విద్యార్థి నిరుద్యోగులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తతం చేశారు.



వికసిత్ భారత్ బిల్డథాన్ 2025

విద్యార్థుల్లో పరిశోధనలకు దోహదం



కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే విద్యార్థుల్లో పరిశోధన, సమస్య పరిష్కారానికి వికసిత్ భారత్ బిల్డథాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. దేశవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో ఆరు నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతతో పాటు సమస్య పరిష్కారానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ వికసిత్ భారత్ బిల్డథాన్ - 2025ను దేశ వ్యాప్తంగా ఒక ఉద్యమంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లోని (ప్రభుత్వ, ప్రైవేట్) ఉపాధ్యాయులు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో మూడు నుంచి ఏడుగురు విద్యార్థులను సమూహాలుగా చేసి వికసిత్ భారత్ బిల్డథాన్ పోర్టల్‌లో ఈ నెల 13వ తేదీలోగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 13న ప్రత్యక్ష సమకాలీన ఆవిష్కరణ కార్యక్రమం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఈ థీమ్స్‌పై వివరణతో పాటు వారు చేసే పద్ధతిపై లైవ్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ ఉంటుంది.

వికసిత్ భారత్ బిల్డథాన్ ఇతివృత్తాలు

1) ఆత్మనిర్భర్ భారత్
స్వావలంబన వ్యవస్థలు, సాధనాలు, పరిష్కారాలను నిర్మించడం
2) స్వదేశీ
స్వదేశీ ఆలోచనలు, జ్ఞాన వ్యవస్థలు, ఆవిష్కరణలను పెంపొందించడం
3) స్థానికులకు స్వరం
స్థానిక ఉత్పత్తులు, వనరులను ప్రోత్సహించడం
4) సమృద్ధ భారత్
శ్రేయస్సు స్థిరమైన అభివృద్ధికి మార్గాలను సృష్టించడం.

» అన్ని పాఠశాలలు పాల్గొనాలి : జిల్లా విద్యాశాఖాధికారి

ఉపాధ్యాయుల పాత్ర

- విద్యార్థి బృందాలకు మార్గదర్శకత్వం
- ఆలోచన, సమస్య పరిష్కారం, నమూనా అభివృద్ధిపై మార్గదర్శకత్వం అందించడం.
- రిజిస్ట్రేషన్ సమర్పణలో సహాయం చేయడం
- పోర్టల్ రిజిస్ట్రేషన్,సమర్పణ (ఆలోచన/నమూనా) ప్రక్రియలో విద్యార్థులకు సహాయం చేయడం.
- థీమ్‌లను వివరించడం
- విద్యార్థులు తమ ప్రాజెక్టులను నాలుగు ప్రధాన థీమ్‌లతో అర్థం చేసుకున్నారని, సమలేఖనం చేసుకున్నారని నిర్ధారించుకోవడం.
- స్థానిక సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వడం,
- ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ, సమృద్ధి భారత్.
- జట్టు కృషిని ప్రోత్సహించండి
- ప్రభావవంతమైన జట్టు డైనమిక్స్ కోసం సహకార వాతావరణాన్ని పెంపొందించుకోవడం.
- మౌలిక సదుపాయాలను అందించడం
- జట్ల ప్రాజెక్టులను సిద్ధం చేయడానికి, నిర్మించడానికి అనుకూలమైన వాతావరణాన్ని (ప్రయోగశాల, తరగతి గది) అందించడం.
- సమర్పణలను నిర్వహించడం.
- విద్యార్థులు తమ తుది ఎంట్రీలను (ఆలోచనలు/ నమూనాలు) అప్‌లోడ్ చేయడంలో మార్గనిర్దేశం చేయడం.

ప్రమోషన్, చేరువ..

చివరి రోజుకు ముందు విద్యార్థుల ఉత్సాహాన్ని నిర్ధారించడానికి కార్యకలాపాల శ్రేణిని నిర్వహించండి. బిల్డథాన్ థీమ్ (ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ, వోకల్ ఫర్ లోకల్, సమృద్ధి) ప్రకారం పాఠశాలలో 4 క్లబ్‌లను ప్రవేశపెట్టడం, పోటీలను నిర్వహించడం (జింగిల్స్, క్విజ్), బిల్డథాన్ పోస్టర్‌లను ప్రదర్శించడం, ప్రింటెడ్ టీ-షర్టుల వంటి ఈవెంట్ బ్రాండెడ్ మర్చండైజ్‌ను ఉపయోగించడం,విద్యార్థుల కోసం వర్క్‌షాప్ నిర్వహించడానికి పరిశ్రమ నిపుణులను ఆహ్వానించడం ద్వారా ఇది చేయొచ్చు.

- పాఠశాలల్లోని ప్రముఖ ప్రదేశాలలో క్యూఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించాలి.
- జింగిల్ లోగోను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల్లో విస్తృతంగా వ్యాప్తి చేయాలి. పాఠశాలల్లో జింగిల్ ప్లే చేయాలి.

విద్యార్థుల పాత్ర

6-12 తరగతుల నుండి 3-7 మంది సభ్యుల బృందంలో చేరండి.

ఆవిష్కరణ :
సృజనాత్మక ఆలోచనలకు మరియు వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేయండి.

నమూనాలను రూపొందించండి :
మీ ఆలోచన, భౌతిక లేదా డిజిటల్ నమూనాను రూపొందించడానికి కలిసి పనిచేయండి.

వీడియోను సృష్టించండి, సమర్పించండి :
మీ ప్రాజెక్ట్ (ఆలోచన లేదా నమూనా) ప్రదర్శించే ఒక చిన్న వీడియోను (2 నిమిషాల్లోపే) తయారు చేసి పోర్టల్‌లో సమర్పించండి.

ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయుల పాత్ర
వికసిత్ భారత్ బిల్డథాన్ లో పాల్గొనడాన్ని ప్రోత్సహించడం
6-12 తరగతుల విద్యార్థులలో బిల్డథాన్‌ను చురుకుగా ప్రచారం చేయడం.

రిజిస్ట్రేషన్‌ను సులభతరం చేయడం..
గడువులోగా అన్ని జట్లు అధికారిక పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయని నిర్ధారించుకోవడం.

ఈనెల 13లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



బి నాగమణి (జిల్లా విద్యా శాఖాధికారి)
ప్రతీ పాఠశాల నుంచి కనీసం 50 మంది విద్యార్థులతో 10 టీములు ఈ నెల 13వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందులో జిల్లాలోని అన్ని పాఠశాలలు పాల్గొనాలి. ఈనెల 13వ తేదీన జరిగే లైవ్ సింక్రొనైజ్డ్ ఇన్నోవేషన్ ఈవెంట్‌లో ఆన్‌లైన్‌లో పాల్గొనాలి. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను సమర్పించాలి.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న తిరుమలరావు

ఉద్యోగుల సమష్టి కృషితో లాభాల్లోకి

సెంట్రల్ వర్క్‌షాపులో మరిన్ని యంత్ర పరికరాలను రూపొందించాలి

సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) తిరుమలరావు

కొత్తగూడెం టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమష్టి కృషితో నష్టాలలో ఉన్న సెంట్రల్ వర్క్‌షాపును లాభాల బాటలోకి తీసుకురావడం జరిగిందని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) తిరుమలరావు అన్నారు. ప్రతీ ఏడాది ఇదే విధంగా సెంట్రల్ వర్క్‌షాపులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరిన్ని యంత్ర పరికరాలను రూపొందించాలని సూచించారు. సెంట్రల్ వర్క్‌షాపులో ఏర్పాటు చేసిన స్టీల్ మెట్లు, ఐ లవ్ సెంట్రల్ వర్క్ షాపు లోగో శిల్పాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ.. కార్మికుల సౌలభ్యం కోసం స్టీల్ మెట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సెంట్రల్ వర్క్ షాపులో రూపొందించే వివిధ రకాల పరికరాలు సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తితో పాటు ఉత్పాదకతలోనూ కీలక పాత్ర వహిస్తున్నాయని చెప్పారు. పెద్ద కంపెనీలు సైతం చేయలేని యంత్ర పరికరాలను కూడా సెంట్రల్ వర్క్ షాపులో రూపొందించడం అభినందనీయమన్నారు. సింగరేణి సంస్థ చైర్మన్ బలరాం నిర్దేశకత్వంలో భవిష్యత్తులో కంపెనీ అభివృద్ధికి బొగ్గుపై ఆధారపడకుండా థర్మల్ పవర్, సోలార్ పవర్, క్రిటికల్ మినరల్స్ రంగాల్లో పాటు బొగ్గు గనుల అన్వేషణలో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉత్పత్తి వ్యయం తగ్గించి నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలని, యంత్ర పరికరాలను రూపొందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం(ఈ అండ్ ఎం) సెంట్రల్ వర్క్ షాపు దామోదర్‌రావు, ఏజీఎం (ఈఅండ్ఎం) మెయిన్ వర్క్ షాపు పి. రాజీవ్ కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్వీ రమణమూర్తి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, ఎస్ఈ (ఈఅండ్ఎం) జి.ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న రవికుమార్, పృథ్వి

నరసాపురం బరిలో బాబాయి.. అబ్బాయి

దుమ్ముగూడెం అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజకీయ చైతన్యం కలిగిన నరసాపురం ఎంపీటీసీ జనరల్ స్థానానికి రెండు వేర్వేరు పార్టీల నుంచి బాబాయి, అబ్బాయిలు గురువారం నామినేషన్లు వేశారు. సీపీఐ తరపున జిల్లా నాయకులు రావులపల్లి రవికుమార్, బీఆర్ఎస్ తరపున యువనాయకుడు రావులపల్లి పృథ్వి నామినేషన్లు వేయడం స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది. రవికుమార్ సొంత అన్న కొడుకు పృథ్వి. పొత్తులు కుదిరితే ఒకరు పోటీ నుంచి తప్పుకుంటారా!? కుదరని పక్షంలో ఇద్దరూ బరిలో ఉంటారా!? అనే విషయమై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

● **నోడల్ అధికారులతో ఎన్నికల పరిశీలకుడు క్రిష్ణ ఆదిత్య**

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు క్రిష్ణ ఆదిత్య అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఆయన ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత నోడల్ అధికారులతో గురువారం ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా క్రిష్ణ ఆదిత్య మాట్లాడుతూ.. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎక్కడైనా కోర్టు కేసులు నమోదు అయ్యాయా, రీపోల్ జరిగిందా!? అనే అంశాలను పరిశీలించి రిపోర్టు అందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ వెబ్ కాస్టింగ్ లేదా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా చూడాలన్నారు. బ్యాలెట్ పేపర్ ముద్రణకు చర్యలు తీసుకోవాలని, అవి ఎట్టి పరిస్థితుల్లో బయటకు పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలన్స్ బృందాలు విస్తృతంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతలో 149 ఎంపీటీసీ, 10 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ అధికంగా ఉంటుందని, అధికారులు నిబంధనల పట్ల అవగాహన లేకుంటే విధుల నిర్వహణ కఠినతరం అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీవో ఆశాలత, ఆర్డీఓ వెంకటరమణ, సీపీవో ఏ. శ్రీనివాస్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, డీవైఎస్వో. సునీల్ రెడ్డి, డీసీవో గంగాధర్, ఎస్డీసి ఎం. రాజేశ్వరి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న క్రిష్ణ ఆదిత్య



జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ముగిసిన భద్రాద్రి జిల్లా ఎస్‌జీఎఫ్ క్రీడలు

డీఈవో నాగలక్ష్మీ డీవైఎస్‌వో పరంధామరెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో నాగలక్ష్మీ, డీవైఎస్‌వో పరంధామరెడ్డి అన్నారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో కొనసాగుతున్న 69వ ఎస్‌జీఎఫ్ జిల్లా పాఠశాలల జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించి పతకాలు సాధించి జీవితాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వాహకులకు, సెక్రెటరీ వాసిరెడ్డి నరేష్‌కుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘాల సభ్యులను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులైన సీత, సుజాత, బుగ్గ వెంకటేశ్వర్లు, బావ్‌సింగ్‌లక్ష్మణ్, శేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌ఫెడ్ నర్సరీని సందర్శిస్తున్న అధికారుల బృందం

నర్సరీలను సందర్శించిన క్వారంటైన్ అధికారుల బృందం

అశ్వారావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది సీజన్‌నాటికి అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో 4.50 లక్షల పామాయిల్ మొక్కలు పెంచేందుకు ఆయిల్‌ఫెడ్ ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో భాగంగా గురువారం క్వారంటైన్ అధికారుల బృందం ఆయిల్‌ఫెడ్ ఓపీడీ అధికారి ప్రవీణ్‌రెడ్డి, ఓపీడీ ఓఎస్‌డి అధికారి కిరణ్, శాస్త్రవేత్తలు విద్యాసాగర్, వెంకటరామిరెడ్డి అశ్వారావుపేట, దమ్మపేటలోని పామాయిల్ మొక్కలు పెంచేందుకు నిర్దేశించిన నర్సరీలను సందర్శించారు. ఈ నెల 18 నుంచి నర్సరీలను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా నర్సరీలలో కావాల్సిన వసతులు, చాంబర్స్, నీటి వసతులు, సౌకర్యాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను తయారు చేసేందుకు ఈ బృందం పర్యటించింది. వీరి అనుమతుల తరువాతే నర్సరీలను ప్రారంభిస్తారు.

విద్యార్థినికి అస్వస్థత

భద్రాచలం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని గురువారం అస్వస్థతకు గురైంది. ఉదయం హాస్టల్ నుంచి పాఠశాలకు వచ్చిన అనంతరం అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి భద్రాచలం ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం విద్యార్థినిని తరలించినట్లు పాఠశాల హెచ్ఎం, ఎంఈవో రమాదేవి తెలిపారు. దీంతో వైద్యులు ఆమెకు చికిత్స నిర్వహించి ఆ తర్వాత బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

సైబర్ మోసగాడి అరెస్టు

దుమ్ముగూడెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాల్లో వినియోగించేందుకు పాత మొబైల్ ఫోన్లను అక్రమంగా కొనుగోలు చేస్తున్న మోసగాడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బిహార్ రాష్ట్రం కతిహార్ జిల్లా గఫర్‌టోలికు చెందిన అక్తర్ అలీఖాన్ పెద నల్లబల్లి కూడలిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి తన ద్విచక్రవాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు పట్టుకొని విచారించగా, పాత మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసి ఇద్దరు సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తానని అంగీకరించాడు. అక్రమంగా సంపాదించిన సొమ్మును తామంతా పంచుకుంటామని తెలిపాడు. కాగా.. పాత మొబైల్ ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించవద్దని సీఐ వెంకటప్పయ్య సూచించారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బూర్గంపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని సోంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య(60) ఈ నెల 3వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో భాధపడుతుండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు గురువారం బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుకను తరలిస్తున్న వాహనాల పట్టివేత

బూర్గంపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు లారీలోకి ఇసుకను లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. గురువారం తెల్లవారుజామున సమయంలో లక్ష్మీపురం గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు చేపట్టారు. గ్రామంలో ఓ ప్రదేశంలో ఇసుకను నిల్వ ఉంచిన స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాల యాజమానులతో పాటు డ్రైవర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కేసు నమోదు చేస్తున్న అధికారులు

కల్లూరు, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రబోయన పల్లి గ్రామంలో గల 20 వ నెంబరు రేషన్ షాపులో గురువారం అదనంగా ఉన్న 13.69 క్వింటాళ్ల బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ షాపులో ఉండాల్సిన స్టాక్ కంటే 13.69 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉన్నాయి. దీంతో విజిలెన్స్ అధికారులు డీలర్ ఏగుపాటి రామారావుపై 6ఏ కేసు నమోదు చేశారు. అదనంగా ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, ఆర్ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కోసం చంపేశారు!

» యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
» ముగ్గురూ కలిసి.. కత్తితో పొడిచి హతమార్చిన వైనం
» ఆ తర్వాత శరీర భాగాలను పారవేసేందుకు యూట్యూబ్‌లో సెర్చ్
» వివరాలు వెల్లడించిన ఏసీపీ తిరుపతి రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతి రెడ్డి

ఖమ్మం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో జిల్లా కేంద్రంలో జరిగిన యువకుడి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. డబ్బు కోసమే ముగ్గురూ కలిసి అతన్ని అతి దారుణంగా హత్య చేసి.. శరీర భాగాలను పారవేసినట్టు పోలీసులు తేల్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం రూరల్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ తిరుపతిరెడ్డి వెల్లడించారు. ఏసీపీ వివరాల ప్రకారం..

కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన గట్ల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ (38) హైదరాబాద్‌లోని ఓ నిర్మాణ సంస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటాడు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వత్సవాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన పరిమి అశోక్ గ్రామంలో వంగతోట సాగుచేసి పంటలు పండక అప్పుల పాలై.. ప్రయివేట్ జాబ్ కోసం ఖమ్మం వచ్చి అద్దె రూమ్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం గ్రంథాలయం వద్ద వెంకటేశ్వర్లుకు, అశోక్‌కు పరిచయం ఏర్పడింది. దీంతో వెంకటేశ్వర్లు ప్రతీరోజు అశోక్ రూమ్‌కు వచ్చి వెళ్లేవాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అశోక్‌కు వెంకటేశ్వర్లు ఆర్థిక సహాయం చేస్తుండేవాడు. ఖమ్మం జిల్లాకు చెందిన నగ్మా ఖమ్మం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయాగా పని చేస్తోంది. ఓ పని నిమిత్తం ఆస్పత్రికి వెళ్లగా.. నగ్మాతో అశోక్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ఇద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. వ్యవసాయం చేసే క్రమంలో డ్రిప్ ఇరిగేషన్ పనిచేసే ఖమ్మం ప్రాంతంలోని బలాపేటకు చెందిన పెంటి కృష్ణయ్యతోనూ అశోక్‌కు పరిచయం ఏర్పడి స్నేహితులుగా మారారు. ఈ సందర్భంగా ముగ్గురు అశోక్, నగ్మా, కృష్ణయ్యల మధ్య వెంకటేశ్వర్లుకు సంబంధించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. వెంకటేశ్వర్లు వద్ద డబ్బు ఉండడంతో.. అతన్ని హత్యచేసి అతడి వద్ద ఉన్న బంగారం, నగదు, ఇతర ఆస్తులను చేజిక్కించుకోవాలనే దురుద్దేశంతో అశోక్ కుట్రకు తెర లేపాడు. అనంతరం వెంకటేశ్వర్లును ఎలా చంపాలి!? చంపిన తరువాత శరీర భాగాలను గుర్తు తెలియని ప్రదేశాల్లో ఎలా వేయాలి!? అన్న అంశాలను ముగ్గురూ కలిసి యూట్యూబ్‌లో సెర్చ్ చేశారు. గత నెల 15వ తేదీన వెంకటేశ్వర్లు యధావిధిగా అశోక్ రూమ్‌కు వచ్చి నిద్రపోయాడు. 16న తెల్లవారుజామున ముగ్గురూ కలిసి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం రూమ్ బయట ఎవరు రాకుండా కాపలాగా నగ్మాను ఉంచారు. అశోక్, కృష్ణయ్యలు కలిసి గది లోపల నిద్రలో ఉన్న వెంకటేశ్వర్లును కత్తితో నరికి అతి కిరాతంగా హత్య చేశారు. మెడపై పలుమార్లు నరికి తల మొండెం వేరు చేశారు. శరీరాన్ని ముక్కలుగా నరికిన తర్వాత ఆ భాగాలను ప్లాస్టిక్ కవర్లలో కట్టి ద్విచక్రవాహనంపై కరుణగిరి ప్రాంతంలోని చెట్ల పొదల్లో విసిరేశారు. ఆ తర్వాత గదిలోని రక్తపు మరకలను నగ్మా శుభ్రం చేసి.. ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. అయితే మృతుడి కుటుంబీకులు.. వెంకటేశ్వర్లు కనబడడం లేదంటూ ఇటీవల కామేపల్లి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. మృతుడి సెల్‌ఫోన్ నెంబర్ల ఆధారంగా దర్యాప్తు కొనసాగించారు. ఆ తర్వాత అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో విచారణ జరిపిన అనంతరం హత్య కేసును ఛేదించారు. నిందితులైన పరిమి అశోక్, కొమ్ము నగ్మా, పెంటి కృష్ణయ్యలను అరెస్టు చేసినట్టు ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తులతో పాటు, రెండు తులాల బంగారు చైన్, సెల్‌ఫోన్లతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. కాగా.. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, బి.సాయి కుమార్, కారేపల్లి ఎస్సై గోపి, కానిస్టేబుల్ సంపత్, ఆనంద్, తదితరులను ఏసీపీ తిరుపతిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

దౌర్జన్యం చేశారని కేసు నమోదు

కొణిజర్ల, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల సమీపంలో మెయిన్‌రోడ్డుకు పక్కన గల శ్రీ శ్రీనివాస క్రాకర్స్ షాపులోకి వి.వెంకటాయపాలెంకు చెందిన కొంతమంది ప్రవేశించి దౌర్జన్యం చేశారన్న ఫిర్యాదు మేరకు గురువారం పలువురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సూరజ్ తెలిపారు. 'మా ఏరియాకు వచ్చి మీరు వ్యాపారం ఎలా చేస్తారు' అన్న బెదిరించినట్టు బాధితులు ఫిర్యాదుల్లో పేర్కొన్నట్టు ఎస్సై తెలిపారు. షాపుసూపర్‌వైజర్ దాసరి వెంకటరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దాడి చేశారని ఇరువర్గాల ఫిర్యాదు

కొణిజర్ల, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఇరువర్గాలు ఒకరికొకరు దాడిచేశారని పేర్కొంటూ గురువారం ఫిర్యాదు చేసినట్టు ఎస్సై సూరజ్ తెలిపారు. గ్రామానికి చెందిన బాణాల వనిత.. తనతో పాటు తన తల్లి చెల్లిని అదే గ్రామానికి చెందిన కోటా శివ, మరికొంతమంది కలిసి అకారణంగా దాడిచేసినట్టు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా వారే తమపై దాడి చేశారని కోట శివ వర్గం కూడా ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు. దీంతో ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ మోటార్లలో కాపర్ చోరీ



చోరీకి గురైన విద్యుత్ మోటారు కాపర్

తల్లాడ, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు వ్యవసాయ విద్యుత్ మోటార్లలో గల కాపర్‌ను గుర్తుతెలియని దొంగలు అపహరించుకుపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత కొంతకాలంగా తల్లాడ, అంజనాపురం, గాంధీనగర్ తండాల్లోని పంటపొలాల్లో సాగునీటి కోసం రైతులు ఏర్పాటు చేసిన వ్యవసాయ విద్యుత్ మోటార్లలోని కాపర్‌ను దొంగలు ఎత్తుకెళుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వ్యవసాయ విద్యుత్ మోటార్లలోని రాగితీగల కోసం దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. విద్యుత్ మోటార్ల కాపర్‌ను అపహరించుకుపోవడం పట్ల వ్యవసాయ విద్యుత్ మోటార్లు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో సకాలంలో సాగునీరందక పైర్లు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఎస్సై వెంకటకృష్ణను వివరణ కోరగా.. వ్యవసాయ విద్యుత్ మోటార్ల కాపర్ కోర్ చోరీ జరిగిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతామని ఎస్సై తెలిపారు.



బీసీ హక్కులపై కేంద్రం వివక్ష : సీపీఐ

ఖమ్మం రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ హక్కులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ బిల్ పాస్ చేయకపోవడంతోనే కోర్టు స్టే విధించిందన్నారు. బీసీ జనాభా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర శాసన సభలో అన్ని పార్టీలతో ఏకగ్రీవంగా ఆమెదింపజేసి గవర్నర్‌కి, రాష్ట్రపతికి పంపిస్తే దాన్ని ఆమోదింప చేయాల్సినటువంటి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదింపచేయకుండా నిర్లక్ష్యంగా బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించిందన్నారు. దీంతో తెలంగాణలో ఎన్నికలకు స్టే వచ్చిందన్నారు.

మాన్యువల్ స్కావెంజర్స్‌పై అభ్యంతరాలు అందించాలి: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాన్యువల్ స్కావెంజర్స్‌పై అక్టోబరు23 లోపు అభ్యంతరాలు అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, భారత ప్రభుత్వం జారీ చేసిన మాన్యువల్ స్కావెంజర్స్ మార్గదర్శకాలను అనుసరించి మాన్యువల్ స్కావెంజర్స్ రిహాబిలిటేషన్ చట్టం 2013 ప్రకారం మాన్యువల్ స్కావెంజర్ సర్వే కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు నిర్వహించిన సర్వేలో ఖమ్మం జిల్లాలో ఏలాంటి మ్యాన్యువల్ స్కావెంజర్స్ గుర్తించలేదని తెలిపారు. దీనిపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే అక్టోబరు23 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయం, కలెక్టరేట్‌లో తెలియజేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. ఏలాంటి అభ్యంతరాలు రాకపోతే ఖమ్మం జిల్లాను మాన్యువల్ స్కావెంజర్స్ లేని జిల్లాగా ప్రకటించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు నేడు (శుక్రవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రయాణికులు 9959225958 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను, సూచనలను తెలియజేయాలని కోరారు.

బీసీలకు మళ్లీ అన్యాయమే

» బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు కృష్ణ



మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీ కులస్తులకు మళ్లీ అన్యాయమే జరిగినట్టయిందని దీనికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని బీసీ సంక్షేమసంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో జరిగిన బీసీ కుల సంగాల ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శతం రిజర్వేషన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. జనాభ దామషా ప్రకారం హక్కుగా రావాల్సిన రిజర్వేషన్లను అడ్డుకోవాలని హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసు వేశారని ఆరోపించారు. ఏదిఏమైనా బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనన్నారు. లేనియెడల ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందన్నారు. ఈసమావేశంలో బీసీ సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, బొమ్మా రాజేశ్వరరావు, కత్తినెప్రహా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అత్యుత్సాహంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్: టీడీపీ

కామేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యుత్సాహంతో జరగవలసిన స్థానిక సంస్థల ఎన్నికల మరోసారి వాయిదా పడ్డాయని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సత్యనారాయణ విమర్శించారు. గురవారం స్థానికంగా వారు మాట్లాడుతూ సరైన పద్ధతిలో రిజర్వేషన్ల వ్యవహారం తేల్చకుండా ఎన్నికలు జరపాలనుకోవడం ప్రభుత్వ చేతకానితనం అన్నారు. అసలు సీఎం తన మంత్రివర్గంలో బీసీలకు 42శాతం ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇవ్వాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లో సర్పంచులు లేక పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాలు పాలవుతున్నారన్నారు.

పత్తికి మద్దతు ధర కల్పించాలి: కొండబాల

తిరుమలాయపాలెం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతు ధర కలిపించాలని టీడీపీ జిల్లా నాయకుడు కొండబాల కరణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిరుమలాయపాలెం లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఏడాది ఖరీఫ్‌లో రైతులు అధికంగా పత్తిపంట సాగుచేశారని, అకాల వర్షంతో పంటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయిందన్నారు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగుచేసినా ఎకరానికి 5క్వింటాల దిగుబడి వచ్చే అవకాశం లేదన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ. 15వేలు మద్దతు ధర పత్తికి ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో కొప్పుల వెంకటరావు, మల్లీడి నాగన్న, రమేష్, భిక్షం, నామా ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీసీలకు చేసిందేమీలేదు: బీజేపీ

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): దేశాన్ని 55ఏళ్లపాటు పాలించని కాంగ్రెస్ బీసీలకు చేసిందేమిలేదని బడుగు, బహుజనుల అభివృద్ధికి బీజేపీ ప్రతిక్షణం కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ కేంద్రంలోకి అధికారంలోకి వచ్చాక మూడు సందర్భాల్లో ఒకసారి ముస్లిం, మరో రెండుసార్లు దళిత, గిరిజినవర్గాలకు చెందిన వారిని రాష్ట్రపతి పదవిలో కూర్చొబెట్టిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడంలో ఏనాడు కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రదర్శించలేదన్నారు.

ఎంఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఎక్స్‌పో అవార్డు



అవార్డు అందుకుంటున్న జయంత్‌రెడ్డి

ఖమ్మం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మానికి చెందిన ఎంఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ 2025ఎక్స్‌పో అవార్డు పాట్నాలో గురువారం అందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బీహార్‌లో నిర్మాణరంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపినందుకు ఖమ్మానికి చెందిన కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాసరెడ్డి సంస్థ ఎంఎస్ఆర్ సంస్థకు కన్‌స్ట్రక్షన్స్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) గుర్తించి ఈ అవార్డు మంజూరు చేసింది. ఎంఎస్ఆర్ సంస్థ సీఈవో మొగిలి జయంత్‌రెడ్డికి ఈనైపుణ్య, నిబద్ధత కనబరిచినందుకు అవార్డు అందించారు. ఈసందర్భంగా జయంత్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఐ నుంచి గుర్తింపుపొందడం మా సంస్థకు ఎంతో గర్వకారణమని, ఇదే అంకిత భావంతో అధికనాణ్యత, నిర్మాణ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. బీహార్ మౌళికసదుపాయాలు కల్పన , రహదారుల పనులు నిర్మాణంలోను సంస్థ ముందుంటుందని అలాగే పర్యావరక్షణ పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

జవాన్ల నియామకంపై పునః పరిశీలన

» ఏఎంసీ వద్ద జాబితాను పరిశీలించిన కమిషనర్



ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో జవాన్ల నియామకంపై వచ్చిన ఆరోపణలపై కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టి సారించారు. ఈ మేరకు జవాన్ల నియామకానికి సంబంధించిన వివరాలను అసిస్టెంట్ కమిషనర్ అనిల్ వద్ద నుంచి ఫైల్ తెప్పించుకొని పారదర్శకంగా నియామకాలు చేయాలని ఆదేశించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'రూ.లక్ష పెట్టు.. జవాన్ ఉద్యోగం పట్టు' కథనంపై కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. జవాన్ల నియామకం ఫైల్‌ను పరిశీలించారు. ఎన్ని ఖాళీలు ఉన్నాయి. ఎంతమంది దరఖాస్తులు చేశారనే విషయాలను పరిశీలించారు.

చక్రం తిప్పుతున్న సంఘాలు

ఖమ్మం నగర పాలక సంస్థలో పాలకవర్గం, అధికారులు చేయాల్సిన నియామక సిఫార్సులు కొన్ని కార్మిక సంఘాలు చక్రం తిప్పుతున్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి. ఖమ్మం నగరంలోని 60 డివిజన్లలో జవాన్లు ఖాళీలు ఏర్పడితే జవాన్లు నియామకం కోసం ఓపెన్ ప్రకటన ద్వారా తెలియజేయాల్సి ఉంటుంది. కాని కొన్ని సంఘాలు నాయకులు ఒక్కో సంఘం నుంచి ఒక్కో కార్మికుడుకి జవాన్‌గా సిఫార్సులు చేయటం విమర్శలకు దారి తీసింది. సంఘాల సిఫార్సులు కలిగిన తక్కువ మంది జవాన్లు దరఖాస్తులు చేయటం చర్చనీయాంశంగా మారింది. వీరిలో కొంతమంది నాయకులు డబ్బులు బేరాలు చేశారని ఆరోపణలు వ్యాపించాయి. జవాన్లు నియామకంలో ఇప్పటికైనా కేఎంసీ పాలకవర్గం, అధికారులు అర్హత కలిగిన వారికే ఓపెన్‌గా జవాను ఉద్యోగం కల్పించాలని కార్పొరేటర్లు కొరుతున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు: ఎస్ఈ

ఖమ్మం అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయాలు సంభవించకుండా ఇంటర్ లింకింగ్ లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కో ఖమ్మం సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ఒకప్రకటనలో తెలిపారు. ఒక సబ్‌స్టేషన్ నుంచి మరొక సబ్‌స్టేషన్‌కు, ఒక లైను నుంచి మరొక లైన్‌కు మధ్య అనుసంధానం ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో, మెయింటినెన్స్ సమయంలో ఇతర కారణాల వల్ల ఒక లైన్, లేదా ఒక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే అనుసంధాన లైన్ ద్వారా ఆప్రాంతాలకు విద్యుత్ పునరుద్ధరణ జరుగుతుందన్నారు. మొదట ఖమ్మం సర్కిల్ పరిధిలోని 6 సబ్‌స్టేషన్ల పరిధిలో ఇంటర్ లింకింగ్ ఏర్పాటు జరిగిందని తెలిపారు.

రేపు 'ఐలు' ఆధ్వర్యంలో సెమినార్

ఖమ్మం లీగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఖమ్మం ఆధ్వర్యంలో న్యాయవాదులకు ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్, మార్కింగ్ ఆఫ్ డాక్యుమెంట్స్‌పై శనివారం సెమినార్ నిర్వహించనున్నారు. స్థానిక జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ సెమినార్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి శివ శంకర్ రావు హాజరవుతారు. ప్రత్యేక అతిథిగా తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ. నరసింహారెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ బాధ్యులు ఏడు నూతల శ్రీనివాసరావు, మందడపు శ్రీనివాసరావు, నవీన్ చైతన్య, చింత నిప్పు వెంకట్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

కామేపల్లి ఎస్ఐగా శ్రీకాంత్

కామేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కామేపల్లి నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పొడిశెట్టి శ్రీకాంత్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధు లు నిర్వహించిన బి. సాయికుమార్ భద్రా ద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎస్ఐ సాయికుమార్ బాధ్యతలను శ్రీకాంత్‌కు అప్పజెప్పారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

» ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ

కామేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని గురువారం ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. 12 టీసీలకుగాను నాలుగు కౌంటర్లును అధికారులు ఏర్పాటు చేశారు. నామినేషన్ కోసం వచ్చే అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు, ఫర్నిచర్, భద్రతా చర్యలను తనిఖీ



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నరసింహారావు



కామేపల్లిలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నామినేషన్లు స్వీకరించే సమయంలో ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్. సుధాకర్, ఎంపీడీవో రవీందర్ అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ కోసం అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. మొదటి రోజు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. ఈ నామినేషన్ కేంద్రాన్ని ఖమ్మం ఆర్డీవో నరసింహారావు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీటీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబందించిన ఓటర్ల జాబితాను కూడా అధికారులు ప్రదర్శించారు.

చేగువేరా ఆశయం కోసం ఉద్యమించాలి

» ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ



గిరిప్రసాద్ భవన్‌లో చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఖమ్మం అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చేగువేరా ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గసభ్యుడు ఇటికాల రామకృష్ణ అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో గురువారం చేగువేరా 58వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చేగువేరా చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసదర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సామ్రాజ్యవ్యతిరేక తిరుగుబాటువిప్లవానికి చేగువేరా దిక్సూచీ అన్నారు. అణిచి వేతలపై గెరిల్లా పోరాటాలు నిర్వహించి ఆయాదేశాలకు స్వాతంత్ర ఫలాలను అందించిన వీరుడు చేగువేరా అని చెప్పారు. శత్రుసేనలు చుట్టిముట్టినా చెక్కుచెదరని చిరునవ్వుతో ప్రపంచ విజేతగా నిలిడన్నారు.

చేగువేరా ప్రపంచ యువతకు ఆదర్శం

కామ్రేడ్ ఎర్నెస్టో చేగువేరా ప్రపంచ యువతకు ఆదర్శమని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ అన్నారు. చేగువేరా వర్ధంతి సభను రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేగువేరా చూపిన ఆదర్శ బాటను నేటి తరం అవలంబించాలన్నారు. కులం మతం భాష పేరిట దేశాన్ని విభజించేందుకు యత్నిస్తున్న శక్తులు సామ్రాజ్యవాద బానిసత్వానికి దారితీస్తున్నాయన్నారు. చేగువేరా స్ఫూర్తితో యువత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలపై పోరాటాలకు దిగాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, జిల్లా నాయకులు సురేష్, అన్వేష్, హరిచంద్ర, అశోక్ శ్రీను పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో...

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

» రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయల నాగేశ్వరరావు

ఖమ్మం అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తాని రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్, ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జోనల్ మహాసభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. నవంబరు 8,9 తేదీల్లో ఖమ్మంలో జరిగే ఎల్ఐసీ ఏవోఐ సోషల్ సెంట్రల్ జోన్ ఆరవ మహాసభల పోస్టర్లను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారం దిశగా మహాసభలు నిర్వహించాలన్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏవోఐ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వజ్జా మల్లిఖార్జున రావు, బొట్ట శ్రీనివాసరావు, కరుణాకర్, సురేష్ కుమార్, వెంకటరమణ, ఉసికల ప్రసాద్, మల్లిఖార్జున్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

సత్తుపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని స్వాగతిస్తూ 50ఆదివాసీ కుటుంబాలు పార్టీలో చేరడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని రుద్రాక్షపల్లిలో కాంగ్రెస్ పార్టీకి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులను ఆయన ప్రకటించారు. 20ఏళ్ల అభివృద్ధిలో వెనుకబడిన తోగ్గూడెం, రంగాపురం, సత్యంపేట, బాసారం, కొమ్ముగూడెం, రుద్రాక్షపల్లి గ్రామాలను అన్నివిధాల అభివృద్ధిలో ముందుంచుతామని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మట్టిరోడ్లు లేకుండా చేస్తామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, కమ్యూనిటీ హాల్, బతుకమ్మ ఘాట్ నిర్మాణాలను చేపట్టడంతో గ్రామాల్లో మౌళిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకముందు సత్తుపల్లి పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

నేడు మధిరలో భట్టి పర్యటన

మధిర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మం చేరుకోనున్న భట్టి అక్కడ స్థానికులను కలుసుకుని ఆ తరువాత వైరాలో జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఆ తరువాత చింతకానిలో స్థానికంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని రాత్రి 8గంటలకు మధిర లోని క్యాంపు కార్యాలయానికి చేరుకుని రాత్రి మధిరలోనే బస చేయనున్నారు.

లౌకిక పార్టీలతో పొత్తు : సీపీఎం

తల్లాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్ష, లౌకిక పార్టీలతో పొత్తుకు సిద్ధమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదినేని రమేష్, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక దొడ్డ కృష్ణయ్య భవనంలో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన ఆ పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఎం పార్టీ సిద్ధంగా ఉందని, బీజేపీ మినహా వామపక్ష లౌకిక రాజకీయ పార్టీలు ఏవైనా కలిసి వస్తే వాటిని తమ పార్టీతో కలుపుకుని స్థానిక ఎన్నికలకు వెళ్తామని వారు తెలిపారు. మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరావు, నాయకులు పులి వెంకటనరసయ్య, కృష్ణయ్య, కళ్యాణపు కృష్ణయ్య, శీలం ఫకీరమ్మ, సత్తెనపల్లి నరేష్, షేక్‌మస్తాన్, చల్లా నాగేశ్వరరావు ముచింతల చెన్నయ్య, రాజబోయిన సైదులు, షేక్ నన్నెసాహెబ్, మన్నేపల్లి రామారావు, ఆదూరి జీవరత్నం, కట్టా దరగయ్య, గండమాల ఆనందరావు, పేరసాని వెంకటయ్య పాల్గొన్నారు.

అంత్యక్రియలు నిర్వహించిన అన్నం ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వైజాగ్ జిల్లా వాసికి ఖమ్మంలో అంత్యక్రియలు నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా సింహాచలం గ్రామానికి చెందిన వీరవెల్లి కుమార్(42) విశాఖపట్నం నుంచి హైదరాబాదు రైల్లో ప్రయాణం చేస్తూ ఖమ్మం సమీపాన అనారోగ్యానికి గురికాగా ఖమ్మంలో రైలు దిగాడు. అతనిని ఖమ్మం రైల్వే పోలీస్‌లు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని వైద్యశాల సిబ్బంది మార్చురీలో భద్రపరిచారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా మృతుడి అత్త నారాయణమ్మ, కుమారుడు అశోక్, చెల్లెలు అన్నపూర్ణ, కుటుంబ సభ్యులు వైజాగ్ నుంచి ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి చేరుకొని మృతదేహాన్ని చూసి గుర్తుపట్టి మృతి పట్ల ఎలాంటి అనుమానాలు లేవు అని పోలీసులకు లిఖితపూర్వకంగా రాసిఇచ్చారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లడానికి ఆర్థిక పరిస్థితి బాగోలేక మృతదేహాన్ని అంత్యక్రియలు



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అన్నం ఫౌండేషన్ సభ్యులు

చేయమని అన్నం ఫౌండేషన్ కోరారు. పోలీసులు వైద్యశాల సిబ్బంది, కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని స్వాదీనపరుచుకోని బల్లేపల్లి వైకుంఠదామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం పౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు చేయూతనివ్వాలి


» న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు

ఖమ్మం కలెక్టరేట్/ ఖమ్మం లీగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :మానసిక వికలాంగులకు చేయూత ఇవ్వాలని ఖమ్మం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కెవీ చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మానసిక వికలాంగులు బహిరంగ ప్రదేశాలలో, రోడ్ల వెంట కనిపిస్తే గుర్తించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలన్నారు. వారికి తగిన చికిత్స ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలలో మెరుగైన వైద్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల వాడకంతో మతిస్థిమితం కోల్పోయి అగాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సులు, న్యాయ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ నరేందర్, వివిధ విభాగాల అధిపతులు సౌమ్యగ్రేస్ , వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాఘవరావు



సత్తుపల్లి రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాయుడు రాఘవరావు నియమితులయ్యారు. మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఈయన్ను నియమిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు నారప రాజు రామచంద్రరావు, నెల్లూరు కోటేశ్వర రావుల నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. చిన్న రైతుకుటుంబంలో జన్మించిన తాను విద్యార్థి దశలోనే రాష్ట్రీయ స్వయం సేవాక్ సంఘ్ భావాలకు ఆకర్షితులై ఆర్ఎస్ఎస్ నేర్పుతున్న దేశభక్తి, క్రమశిక్షణ, నిజాయితీతో కూడిన జీవనవిధానం మొదలైన అంశాలకు ప్రభావితమైనట్లు రాఘవరావు తెలిపారు ...





రుద్రాక్షపల్లిలో పార్టీలో చేరిన మహిళలతో డాక్టర్ దయానంద్

అభివృద్ధిని స్వాగతిస్తూ ఆదివాసీ కుటుంబాల చేరిక

సత్తుపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని స్వాగతిస్తూ 50ఆదివాసీ కుటుంబాలు పార్టీలో చేరడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. గురువారం మండలంలోని రుద్రాక్షపల్లిలో కాంగ్రెస్ పార్టీకి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులను ఆయన ప్రకటించారు. 20ఏళ్ల అభివృద్ధిలో వెనుకబడిన తోగ్గూడెం, రంగాపురం, సత్యంపేట, బాసారం, కొమ్ముగూడెం, రుద్రాక్షపల్లి గ్రామాలను అన్నివిధాల అభివృద్ధిలో ముందుంచుతామని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మట్టిరోడ్లు లేకుండా చేస్తామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, కమ్యూనిటీ హాల్, బతుకమ్మ ఘాట్ నిర్మాణాలను చేపట్టడంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకముందు సత్తుపల్లి పట్టణంలోని వెంగళరావు నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ముస్లిం కమిటీ అధ్యక్షుడిగా రవూఫ్



కల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల ముస్లిం (సదర్) అధ్యక్షుడిగా సయ్యద్ రవూఫ్ ఎంపికయ్యారు. గురువారం జరిగిన మండల ముస్లిం త్రిసభ్య కమిటీ సమావేశంలో సభ్యులందరి ఆమోదంతో రవూఫ్‌ను ఎంపిక చేయడం జరిగింది. ఆయన ఎంపికను మండల ముస్లిం త్రీసభ్య కమిటీ ఎన్నికల అధికారులు ఎస్‌కె మునాఫ్, ఎస్‌డి అమీరుద్దిన్, ఎస్‌కె ఉస్మాన్‌లు ప్రకటించారు.

పోషణ మాసోత్సవాలు

వేంసూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడసర్లపాడు గ్రామంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల కార్యక్రమాన్ని జరిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆహార పిరమిడ్, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ, ర్యాలీ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శాలిని, నిర్మల, విజయకుమారి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ముదిగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అవధానుల మురళీకృష్ణ వివిధ సంస్థల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. గురువారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయనను ప్రధానోపాధ్యాయురాలు శాంతి, ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాఘవరావు



సత్తుపల్లిరూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాయుడు రాఘవరావు నియమితులయ్యారు. మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఆయనను నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు నారపరాజు రామచంద్రరావు, నెల్లూరు కోటేశ్వరరావుల నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు స్టేతో ఆశావహుల్లో నైరాశ్యం

దాఖలు కాని నామినేషన్లు.. బీసీ వర్గాల్లో గుబులు

బోనకల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పుతో స్థానిక పోరుకు సిద్ధమైన ఆశావహుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. గురువారం ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కొందరు నామినేషన్లు వేసేందుకు అన్ని సిద్ధం చేసుకున్నారు. మరికొందరు మాత్రం కోర్టు తీర్పు కోసం వేచి చూశారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు నిర్వహించారు. మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా బీఆర్ఎస్, సీపీఎం పొత్తు కుదుర్చుకుని 8 స్థానాలు సీపీఎంకు, 5 స్థానాలు బీఆర్ఎస్ అభ్యర్థులు బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. ఎంపీపీ సీపీఎంకు, జడ్పీటీసీ బీఆర్ఎస్ అభ్యర్థికి సీట్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం తమ అభ్యర్థులను ఒంటరిగానే బరిలో దించేందుకు సిద్ధమైంది. ఈ పరిస్థితులలో తాజాగా వెలువడిన హైకోర్టు తీర్పు అందరి ఆశలపై నీళ్లు చల్లిందన్న చర్చ జరిగింది. బీసీ రిజర్వేషన్ల అంశంతో ఆ వర్గాల వారికి స్థానిక పోరులో అత్యధిక సీట్లు కేటాయించినా, రిజర్వేషన్ల జీవో పై స్టే రావడంతో బీసీ వర్గాలు నిరుత్సాహానికి గురయ్యారు. మరల తమకు అనుకూలంగా రిజర్వేషన్ల కేటాయింపు ఉంటుందా? లేదా? పాత పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయా? పార్టీ పరంగా బీసీలకు ఎక్కువ సీట్లు ఇస్తారా? అన్న మీమాంసలో బీసీ వర్గాలు ఉన్నాయి.

నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన జడ్పీసీఈవో



పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో దీక్షారైనా

ముదిగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ల కేంద్రాలను గురువారం ఖమ్మం జడ్పీసీఈవో దీక్షారైనా, ఆర్డీవో నర్సింహారావు పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్వో మహేష్‌బాబు, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీవో వాల్మీకి కిషోర్, మండలపరిషత్ సూపరింటెండెంట్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

రెండు నామినేషన్లు దాఖలు

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు తొలిరోజు గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. జడ్పీటీసీ స్థానానికి తిరుమలాయపాలెంకు చెందిన మట్టి ప్రసాద్ ఆధార్ పార్టీ నుంచి, చిరుమర్రి ఎంపీటీసీ స్థానానికి సామినేని రాంబాబు సీపీఎం పార్టీ తరపున నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో శ్రీధర్‌స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో మహేష్‌బాబు, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీవో వాల్మీకి కిషోర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో నాయకులు

కల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ గురువారం చలో బస్సు భవన్‌కు పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో కల్లూరు మునిసిపాలిటీలో పలువురు ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. చలో బస్సు భవన్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపు నిచ్చినారు. ఆ క్రమంలో కల్లూరు ప్రాంతంలోని పార్టీ నాయకులను ఆ కార్యక్రమనికి తరలివెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.



మత పరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం: నంబూరి




సత్తుపల్లిరూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బీసీల అభ్యున్నతికి కృషి చేస్తుందని, ఒక బీసీని ఈ దేశ ప్రధానిని చేసిందని, కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం కల్పించిన బీజేపీ మత పరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి 42శాతంలో ముస్లిం రిజర్వేషన్ తొలగిస్తే హాట్ కామెంట్లు చేశారని, ముస్లింలకు 10వాతం రిజర్వేషన్లు తీసేస్తే బీసీల రిజర్వేషన్ల బాధ్యత తానే తీసుకుంటానని అన్నారని గుర్తుచేశారు. బీసీలపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అసెంబ్లీ సమావేశాలను జరిపి 10శాతం ముస్లీం రిజర్వేషన్లను తొలగిస్తే బీజేపీ పూర్తి మద్దతు తెలిపి రిజర్వేషన్ అమలయ్యేలా చేస్తుందన్నారు.

నేడు వైరాలో భట్టి సమక్షంలో
కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

వైరా, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో శుక్రవారం వైరాలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు జరుగనున్నాయి. ఆమేరకు గతంలో రెండుసార్లు వాయిదా పడిన ఈ చేరికలు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సమక్షంలో జరుగనున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, సేవ కార్యక్రమాల్లో తనకంటూ ప్రత్యేకత చాటుకుంటున్న డాక్టర్ కాపా మురళీకృష్ణ సహా బీఆర్ఎస్ నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరికలకు ఏర్పాట్లు చేశారు. మండల కాంగ్రెస్ కార్యాలయంలో విక్రమార్క, రాందాస్‌నాయక్ పాల్గొనే కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి కోరారు.

నేడు మధిరలో భట్టి పర్యటన



మధిర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మం చేరుకోనున్న భట్టి అక్కడ స్థానికులను కలుసుకుని ఆ తరువాత వైరాలో జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఆ తరువాత చింతకాని లో స్థానికంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని రాత్రి 8గంటలకు మధిర లోని క్యాంపు కార్యాలయానికి చేరుకుని రాత్రి మధిరలోనే బస చేయనున్నారు.

బీసీ రిజర్వేషన్ కోసం కొవ్వొత్తుల ర్యాలీ



వనంవారికిష్టాపురంలో కొవ్వొత్తులర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ ఇచ్చిన ప్రభుత్వం జీవో నెంబర్9పై హైకోర్టులో స్టే విధించడాన్ని నిరసిస్తూ గురువారం ముదిగొండ మండలం వనంవారికిష్టాపురంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు తుపాకుల యలగొండస్వామి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హైకోర్టులో స్టేను ఎత్తివేయాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలను అణగదొక్కేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని నాయకులను కోరారు.



సాయి మందిరంలో అన్నవితరణ కార్యక్రమం



అన్నవితరణ ప్రారంభిస్తున్న పొంగులేటి మహిందర్‌రెడ్డి

కల్లూరు, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలోని శ్రీ షిరిడి సాయిరామ ధ్యాన మందిరంలో గురువారం అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మందిరంలో ఏర్పాటు చేసిన అన్నవితరణను దాతలైన ప్రముఖులు పొంగులేటి మహిందర్‌రెడ్డి, వాణిరెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

లౌకిక పార్టీలతో పొత్తు

తల్లాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్ష, లౌకిక పార్టీలతో పొత్తుకు సిద్ధమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదినేని రమేష్, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక దొడ్డ కృష్ణయ్య భవనంలో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన ఆ పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఎం పార్టీ సిద్ధంగా ఉందని, బీజేపీ మినహా వామపక్ష లౌకిక రాజకీయ పార్టీలు ఏవైనా కలిసి వస్తే వాటిని తమ పార్టీతో కలుపుకుని స్థానిక ఎన్నికలకు వెళ్తామని వారు తెలిపారు. ప్రజల సమస్యలపై అనునిత్యం ప్రజల్లో ఉండి ప్రజలతో మమేకమై ప్రజా పోరాటాల దిశగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేసే సీపీఎం అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు. మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరావు, నాయకులు పులి వెంకటనరసయ్య, కృష్ణయ్య, కళ్యాణపు కృష్ణయ్య, శీలం ఫకీరమ్మ, సత్తెనపల్లి నరేష్, షేక్‌మస్తాన్, చల్లా నాగేశ్వరరావు ముచింతల చెన్నయ్య, రాజబోయిన సైదులు, షేక్ నన్నెసాహెబ్, మన్నేపల్లి రామారావు, ఆదూరి జీవరత్నం, కట్టా దరగయ్య, గండమాల ఆనంద రావు, పేరసాని వెంకటయ్య, మేడి భిక్షం, యాకోబు పాల్గొన్నారు.



